రైతు వెంటే జగనన్న ప్రభుత్వం

- టి.నరసాపురం మండలంలో 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు
- విద్యుత్ సమస్యలు తొలగడంపై రైతుల హర్షాతిరేకాలు

టి.నరసాపురం: రైతే రాజు అన్న నానుడిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిజం చేస్తోంది. రైతు సంతోషంగా ఉన్నప్పుడే సమాజం ఉన్నతిలో ఉంటుందని భావించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. విత్తు నుంచి పండిన పంట అమ్ముకునే దాకా ప్రతి దశలోనూ రైతుకు రాష్ట్ర ప్రభుత్వం వెన్నంటి నిలుస్తోంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో రైతు అభివృద్ధి కూడా ఒకటి. ఆ దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొలువుదీరగానే ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి రైతుకు సాగు కష్టాలను తీర్చుతోంది. ఈ ఐదేళ్ల కాలంలో వ్యవసాయాన్ని సీఎం జగన్ పండుగలా మార్చారు.

వ్యవసాయానికి 9 గంటల నాణ్యమైన విద్యుత్

పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, ఆర్థిక స్వావలంబన కోసం, వ్యవసాయ పెట్టుబడుల కోసం ప్రభుత్వం రైతు భరోసా అమలు చేస్తోంది. ఇదేకాక పంట పండించడానికి నిత్యం అవసరమైన విద్యుత్‌ను సైతం నాణ్యంగా అందించేందుకు చర్యలు తీసుకుంది. నిత్యం రైతులకు 9 గంటల పాటు అంతరాయాలు లేకుండా నాణ్యమైన త్రీ ఫేజ్ విద్యుత్‌ను సరఫరా చేసేందుకు నిరంతరం శ్రమిస్తోంది. జిల్లాలోని విద్యుత్ వినియోగం అధికంగా జరిగే మండలాల్లో టి.నరసాపురం మండలం ఒకటి. ఇది పూర్తి మెట్ట ప్రాంతం. ఈ ప్రాంతంలో భూగర్భ జలాల ద్వారానే వ్యవసాయం సాగు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. విద్యుత్‌ను నిరంతరాయంగా అందించే క్రమంలో మండలంలోని శ్రీరామవరంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రూ.60 కోట్ల వ్యయంతో నిర్మించారు. రైతులందరికీ అందుబాటులో ఉండే విధంగా శ్రీరామవరాన్ని ఎంపిక చేసి ఐదు ఎకరాల భూమిలో ఈ విద్యుత్ ఉప కేంద్రాన్ని నిర్మించారు. ఈ విద్యుత్ ఉప కేంద్రానికి చుట్టూ ఉన్న అన్ని గ్రామాలకు విద్యుత్ అంతరాయాలు లేకుండా సరఫరా చేసేందుకు వీలు కలుగుతుంది. గతంలో మండలంలో 30 కిలోమీటర్ల నిడివి గల విద్యుత్ లైను ద్వారా విద్యుత్ సరఫరా అయ్యేది. దీని వల్ల విద్యుత్ కొంత మేర వృథాకావడం, విద్యుత్ సమస్యలు కూడా ఉండేవి. సబ్ స్టేషన్ నిర్మాణంతో విద్యుత్ సరఫరా అయ్యే లైన్‌ల విస్తీర్ణాన్ని 15 నుంచి 16 కిలోమీటర్లకు తగ్గింది. దీని వల్ల విద్యుత్ సరఫరాలో విద్యుత్ లైన్ లాస్ తగ్గింది. అలాగే సబ్‌స్టేషన్ నిర్మాణంతో లోవోల్టేజీ సమస్యతో పాటు అంతరాయాలు తగ్గి నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది. అదే విధంగా రైతులకు నవరత్నాల్లో భాగమైన తొమ్మిది గంటల విద్యుత్ సరఫరాకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.



టి.నరసాపురం మండలం శ్రీరామవరంలో నిర్మించిన 132 కేవీ విద్యుత్ ఉప కేంద్రం



సబ్‌స్టేషన్ కంట్రోల్ సెంటర్

24 గంటల విద్యుత్‌కు వెసులుబాటు

గ్రామాల్లో 24 గంటల విద్యుత్ సరఫరాకు వెసులుబాటు కలుగుతుంది. ఈ విద్యుత్ ఉప కేంద్రాన్ని పూర్తిగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. ఈ విద్యుత్ ఉప కేంద్రానికి కామవరపుకోట నుంచి రెండు లైన్‌ల ద్వారా, అశ్వరావుపేట నుంచి రెండు లైన్‌ల ద్వారా విద్యుత్ సరఫరా చేసే వెసులుబాటు ఉంది. ఏదైనా సమస్య వచ్చినప్పుడు మూడు లైన్లు పని చేయకపోయినా నాలుగో లైన్ ద్వారా విద్యుత్ సరఫరా చేయగలుగుతారు.

మండలంలో 28 వేల విద్యుత్ సర్వీసులు

మండలంలో 10 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇళ్ల సర్వీసులు వ్యాపార వాణిజ్య సంబంధ సర్వీసులు ఇతర సర్వీసులు కలిపి 18 వేల సర్వీసులు ఉన్నాయి. ఈ విద్యుత్ ఉపకేంద్రం నుంచి మక్కినవారిగూడెం, టి.నరసాపురం, బండివారిగూడెం, మధ్యాహ్నపువారిగూడెం 33 కేవీ సబ్‌స్టేషన్‌లకు నేరుగా విద్యుత్ సరఫరా అవుతుంది. దీని ద్వారా మండలంలోని మిగతా సబ్‌స్టేషన్‌లపై కూడా భారం తగ్గుతుంది. ఈ 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ గత ఏడాది జూలై 28వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. ఆనాటినుంచి రైతుల కష్టాలు గట్టెక్కాయి.

సీఎం వైఎస్ జగన్ రైతు పక్షపాతి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి. రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆయన పనిచేస్తున్నారు. మెట్ట ప్రాంత రైతులకు నాణ్యమైన విద్యుత్ అవసరం అని, దాని కోసం 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించాలని కోరిన వెంటనే సానుకూలంగా స్పందించి మంజూరు చేశారు. రూ.60 కోట్లతో ఇక్కడ సబ్‌స్టేషన్‌ను నిర్మించడం వల్ల రైతులకు అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు వెసులుబాటు కలిగింది.

– తెల్లం బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే

రేపటి నుంచి శివయ్య కల్యాణోత్సవాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయం శివయ్య కల్యాణ మహోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. అందులో భాగంగా ఇప్పటికే ఆలయం ముందు చలువ పందిళ్ల నిర్మాణం, రంగులు వేసే పనులు, విద్యుద్దీప అలంకారాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈనెల 5న ప్రారంభం కానున్న కల్యాణోత్సవాలు 11 వరకు జరుగనున్నాయి. అందులో భాగంగా 5న ఉదయం స్వామివారిని పెండ్లి కుమారునిగాను, అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా ముస్తాబు చేస్తారు. 6న సాయంత్రం 7 గంటల నుంచి వినాయక పూజ, దీక్షాధారణ, యాగశాల ప్రవేశన, అంకురార్పణ, మండపారాధన, ధ్వజారోహణ, బలిహరణ కార్యక్రమాలు జరుగుతాయి. అలాగే 7న సాయంత్రం వేదపారాయణం, అభిషేకం, అనంతరం నంది వాహనంపై గ్రామోత్సవం, 8న శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాత్రి 9 గంటలకు లింగోద్భవ కాల అభిషేకం అనంతరం స్వామివారి కల్యాణోత్సవం, ఆ తర్వాత శేష వాహనంపై గ్రామోత్సవం జరుగనుంది. 9న స్వామి వారికి అభిషేకం, అమ్మవార్లకు కుంకుమార్చన, సాయంత్రం గజ వాహనంపై గ్రామోత్సవం, 10న ఉదయం 9 గంటలకు త్రిశూలవారి వసంతోత్సవం, కోవెల ఉత్సవం, పూర్ణాహుతి, దీక్షా విరమణ, ధ్వజ అవరోహణ అనంతరం రుద్రాక్ష వాహనంపై గ్రామోత్సవం, 11న రాత్రి 7 గంటలకు ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగోత్సవం జరుగుతుంది. ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని ఆలయ ఈఓ వేంద్ర త్రినాధరావు కోరారు.



క్షేత్రపాలకుని ఆలయ ముఖ ద్వారం

ప్రభుత్వ సేవలు ప్రజల చెంతకే..

టి.నరసాపురం: సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా పాలనను ఇంటి ముంగిటకే తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని బండివారిగూడెంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ గాంధీజీ కన్న కలలను నిజం చేసిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. దేశంలోనే ఆదర్శవంతమైన పాలనను అందించారన్నారు. నేరుగా సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఖాతాలకు జమ చేయడంతో పాటు అభివృద్ధి పనుల ద్వారా గ్రామాల రూపురేఖలనే మార్చివేశారన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట వేశారని, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనురాజు, పిన్నమనేని చక్రవర్తి, దేవరపల్లి ముత్తయ్య, దాసరి రాంబాబు, బండి సుబ్బారావు, యర్రా గంగాధరరావు, ఎంపీటీసీ చింతం నాగమణి, సర్పంచ్ ఎస్.శిరీష తదితరులు పాల్గొన్నారు.



బండివారిగూడెంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

మానవత సంస్థకు శాంతి రథం అందజేత

ద్వారకాతిరుమల: మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు మాజీ జెడ్పీటీసీ మొగతడకల లక్ష్మీరమణి, శ్రీనివాసరావు దంపతులు ఆదివారం శాంతి రథాన్ని అందజేశారు. శ్రీనివాస్ తన తండ్రి మొగతడకల సత్యన్నారాయణ జ్ఞాపకార్థం ఈ రథాన్ని అందించారు. ముందుగా స్థానిక శ్రీశ్రీనివాసా జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో శ్రీనివాసరావు మాట్లాడారు. రూ.5.25 లక్షలకు పైగా వెచ్చించి కొనుగోలు చేసిన ఈ రథాన్ని ద్వారకాతిరుమల మండల ప్రజల సౌకర్యార్థం వినియోగించాలని కోరారు. అనంతరం శాంతి రథాన్ని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు సీఎస్ రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ దావులూరి ప్రభాకరరావు, వీరంకి వెంకన్నబాబు, కోచైర్మన్ ఆనంద్ కుమార్, కన్వీనర్ పావులూరు మధుసూదనరావు, డైరెక్టర్లు గంజి కాశీ విశ్వనాథం, బొప్పన వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు చిలుకూరి సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ నాదెండ్ల బుల్లివెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



శాంతి రథాన్ని ప్రారంభిస్తున్న మానవత సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి, తదితరులు

వేములపల్లిలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

లింగపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకొని పార్టీ నేత బీవీఎస్ రెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. వేములపల్లిలో పార్టీ నేత బీవీఎస్ రెడ్డి రూ.7 లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను వారు ప్రారంభించారు. అలాగే 800 వాటర్ క్యాన్‌లను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించి జగనన్నకు కానుకగా ఇద్దామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, కర్లపూడి జాన్సీఆనంద్, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఎం.సాయిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కొఠారి మోహన్, రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, మండల వైఎస్సార్ సీపీ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, మందలపు నరిశింహారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు చలగుళ్ల రవిబాబు, పి.వేమనరెడ్డి, కె.ఆనంద్, ఇనుగంటి రాజేష్, పి.వేమనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేములపల్లిలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

పోలియో నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

బుట్టాయగూడెం: పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని తెల్లంవారిగూడెంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేసి చిన్నారుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేద్దామన్నారు. తెల్లంవారిగూడెంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ కారం శాంతి, డాక్టర్ ఎస్ నందిని, డాక్టర్ గణేష్ ప్రారంభించారు.

జంగారెడ్డిగూడెం: పోలియో నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని దళితవాడ, డాంగేనగర్ యూపీహెచ్‌సీల పరిధిలో మొత్తం 4703 మంది చిన్నారులకుగాను 4677 మందికి పోలియో చుక్కలు వేసినట్లు చెప్పారు. మొత్తంగా 99.44శాతం పోలియో చుక్కలు వేశామన్నారు. మెడికల్ ఆఫీసర్‌లు డాక్టర్ సందీప్, డాక్టర్ పఠాన్ దాదా పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వైద్యాధికారి ఎ.అశోక్ కుమార్ తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం బస్టాండ్ సెంటర్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు.

4539 మంది చిన్నారులకు పోలియో చుక్కలు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలంలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. లక్కవరం, బొర్రంపాలెం, తాడువాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 4,617 మంది చిన్నారులు లక్ష్యంకాగా 4539 మందికి పోలియో చుక్కలు వేశారు. శ్రీనివాసపురం, చక్రదేవరపల్లి గ్రామాల్లో చిన్నారులకు జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి పోలియో చుక్కలు వేశారు. లక్కవరంలో ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్ గెల్లా వెంకట రమణ, పుట్లగట్లగూడెంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు పోలియో చుక్కలు వేశారు.

చింతలపూడిలో...

చింతలపూడి: చింతలపూడి నగర పంచాయితీ పరిధిలోని భట్టువారిగూడెం పోలియో కేంద్రం వద్ద ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండలంలోని యర్రగుంటపల్లి, రాఘవాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 6,500 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు చర్యలు తీసుకున్నట్లు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డా కె అనిల్ కుమార్ తెలిపారు. పోతునూరు గ్రామంలో సర్పంచ్ కె లక్ష్మీ ప్రసన్నకుమారి, వెంకటాద్రిగూడెంలో సర్పంచ్ ఆర్‌వీ రామారావు, ప్రగడవరంలో సర్పంచ్ టి భూపతి, చింతంపల్లిలో సర్పంచ్ తాండ్ర రామకృష్ణారావు తదితరులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

కామవరపుకోట: తడికలపూడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు జెడ్పీటీసీ కడిమి రమేష్ పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు గంగుల కాశీ, ఎంపీటీసీ గంగుల కడియాలు, తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం: మండలంలోని 46 కేంద్రాల ద్వారా ఆదివారం 3456 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. మిగిలిన చిన్నారులకు సోమ మంగళవారాల్లో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తామని డాక్టర్ జే కల్పనారాణి తెలిపారు

కుక్కునూరు: మండల పరిధిలో ఆదివారం 97 శాతం మంది చిన్నారులకు పోలియో వ్యాక్సిన్ వేసినట్టు కుక్కునూరు, అమరవరం పీహెచ్‌సీ వైద్యులు డా.శ్రీనివాస్, డా.అనంత్ తెలిపారు. రెండు పీహెచ్‌సీల పరిధిలో 76 కేంద్రాల ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించామన్నారు. అమరవరం పీహెచ్‌సీ వైద్యులు డా.అనంత్ బరపటినగర్, రెడ్డిగూడెం తోగు, గుట్టపుతోగు తదితర గొత్తికోయ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కేంద్రాలకు స్వయంగా వెళ్లి చిన్నారులకు వ్యాక్సినేషన్ అందించారు.

కొయ్యలగూడెం: రాజవరం గ్రామంలో జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, మంగపతిదేవిపేట గ్రామంలో ఎంపీటీసీ తేలే శ్రీనివాస్ చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, కొయ్యలగూడెం బయ్యనగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారులు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

పోలవరం: మండలంలో 97 శాతం మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. వింజరం పీహెచ్‌సీ పరిధిలో 1363 మంది చిన్నారులకుగాను 1335 మందికి, ఎల్ఎన్‌డీపేట పీహెచ్‌సీ పరిధిలో 1130 మందికిగాను 1106 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఎంపీపీ సుంకర వెంకట్ రెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుగ్గ మురళీకృష్ణ ఆయా కార్యక్రమాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

ద్వారకాతిరుమల: మండలంలో ఆదివారం 76 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామ సచివాలయాలతో పాటు, చినవెంకన్న దేవస్థానంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. చినవెంకన్న దర్శనార్థం క్షేత్రానికి విచ్చేసిన యాత్రికుల పిల్లలకు ఆలయ ఈఓ త్రినాధరావు స్వామివారి కల్యాణ మండపంలో పోలియో చుక్కలు వేశారు. మండలంలో 95 శాతం పోలియో వ్యాక్సినేషన్ పూర్తయినట్టు ద్వారకాతిరుమల పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.



బుట్టాయగూడెం: తెల్లంవారిగూడెంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



జంగారెడ్డిగూడెం: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

క్లుప్తంగా

ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి



వేములపల్లిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ప్రచారం చేస్తున్న దృశ్యం

లింగపాలెం: లింగపాలెంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం ప్రారంభించారు. ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి తమను గెలిపించాలని వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు ప్రజలను కోరారు. లింగపాలెం నుంచి శింగగూడెం, కొత్తపల్లి, రంగాపురం మీదుగా ముడిచెర్ల వేములపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మళ్లీ జగనన్న సీఎం అయితేనే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రచారంలో భాగంగా బీవీఎస్ రెడ్డి అధ్వర్యంలో కార్ల ర్యాలీ ఆకట్టుకుంది. ప్రచార రథంపై వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ స్మారక భవనం పూర్తి



సరిపల్లిలో నిర్మాణం పూర్తి చేసుకున్న వైఎస్సార్ స్మారక భవనం (ఇన్‌సెట్లో మహానేత వైఎస్సార్)

కొయ్యలగూడెం: వైఎస్సార్ స్మారక భవన నిర్మాణం పూర్తయ్యింది. సరిపల్లిలోని నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం వద్ద మూడు రోడ్ల జంక్షన్ ప్రాంతంలో రెండున్నర లక్షల రూపాయలతో వైఎస్సార్ స్మారక భవనాన్ని నిర్మించారు. పీఏసీఎస్ అధ్యక్షురాలు మందపాటి శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్మాణం గావించిన స్మారక భవనానికి పార్టీ అభిమానులు, అదేవిధంగా గ్రామకన్వీనర్ ఎం.రామకృష్ణ ఆర్థిక వనరులను సమకూర్చినట్లు శ్రీదేవి పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నమూనాతో దానిపై నిలిచి ఉండి అభివాదం చేస్తున్న ఏడున్నర అడుగుల మహానేత విగ్రహం దాని వెనుక యువనేత, ముఖ్యమంత్రి జగన్ చిత్రంతో పాటుగా స్మారక భవనం విశేషంగా ఆకర్షిస్తోంది. త్వరలోనే ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ స్మారక భవన నిర్మాణాన్ని ప్రారంభోత్సవం చేయనున్నట్లు శ్రీదేవి తెలిపారు.

రంజాన్‌కు స్వాగతం




రంజాన్‌కు స్వాగతం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎండీ సిద్దిఖ్

చింతలపూడి: స్థానిక జామియా మసీదు ఆవరణలో ఆదివారం 'రమజానుకు స్వాగతం' కార్యక్రమం పట్టణ జమాత్ ఇస్లామి హింద్, మసీదు కమిటీ అధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసంగికుడు, భీమవరం జమాత్ ఇస్లామి హింద్ సభ్యుడు ఎండీ సిద్దిఖ్ మాట్లాడుతూ పవిత్ర ఖురాన్ అవతరింపబడింది రంజాన్ మాసంలోనే అని అన్నారు. కార్యక్రమంలో గోపాలపురం ప్రసంగికులు అబ్దుల్ నదీం, ఎండీ అక్బర్ అలీలు ప్రసంగించారు. పట్టణ జమతే ఇస్లామి హింద్ అధ్యక్షుడు ఎస్ కే హుస్సేన్, మసీదు కమిటీ ప్రెసిడెంట్ సయ్యద్ రహీమ్, కార్యదర్శి జిలానీ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ నూతన కార్యవర్గం

జంగారెడ్డిగూడెం: రోటరీ సర్వసభ్యసమావేశం స్థానిక శ్రీమల్లాది సీతారామలింగేశ్వర రావు రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. రోటరీ జంగారెడ్డిగూడెం 2024–25 సేవాసంవత్సరం అధ్యక్షునిగా ఉడా రాంగోపాల్ (గోపీ), కార్యదర్శిగా బవిరిశెట్టి హనుమాన్ తిలక్‌లను ఎంపిక చేసినట్లు రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ఎలెక్ట్ దాకారపు కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పాలపర్తి శ్రీనివాస్, కేఎల్ఎన్ ధనకుమార్, జవ్వాజి ఉమా వెంకటేష్, పడాల సూర్యనారాయణరెడ్డి, అయినపర్తి చంద్రశేఖర్, జయవరపు కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి



శ్మశానవాటికను అభివృద్ధి చేసిన దాతలు

చింతలపూడి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చింతలపూడి శాఖ ఆధ్వర్యంలో మాదాపుకుంట శ్మశానవాటికను అభివృద్ధి చేశారు. ఈ శ్మశానవాటికను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్మశానవాటిక అభివృద్ధికి విరాళాలు అందించిన 40 మంది దాతలను మానవత శాఖ సత్కరించింది. కార్యక్రమంలో గౌరవ డైరెక్టర్ ఎ.సత్యనారాయణ, చైర్మన్ ఎ.అప్పారావు, కన్వీనర్ కె.నాగచిన్నారావు, అధ్యక్షుడు పి.సోమశేఖరాచార్యులు, సభ్యులు పాల్గొన్నారు.

కాపు జేఏసీ అధ్యక్షుడిగా సంకు మధు

కొయ్యలగూడెం: పోలవరం నియోజకవర్గ కాపు జేఏసీ అధ్యక్షుడిగా తాను నియమితులైనట్లు కొయ్యలగూడెం గ్రామానికి చెందిన సంకు మధు తెలిపారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు నియామక పత్రాలను అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పోలవరం నియోజకవర్గ పరిధిలో కాపుల ఐక్యతకు, అభివృద్ధికి కృషి చేస్తానని మధు తెలిపారు.

గోదావరిలో ఫిల్టర్ పాయింట్ ఏర్పాటు



గోదావరిలో ఫిల్టర్ పాయింట్

కుక్కునూరు: కుక్కునూరు పంచాయతీ పరిధిలో గ్రామస్తులకు స్వచ్ఛమైన నీటిని అందించే దిశగా కుక్కునూరు గోదావరి నదిలో ఫిల్టర్ పాయింట్ ఏర్పాటు చేసే ప్రక్రియ ఆదివారం పూర్తైనట్లు సర్పంచ్ రావు మీనా వినోద్ తెలిపారు. గోదావరిలో వరద ప్రవాహం కారణంగా ఫిల్టర్ పాయింట్ ఏర్పాటు చేయలేకపోయామన్నారు. దీంతో ఇప్పటివరకు ప్రవాహపు నీటినే అందించాల్సి రావడంతో మురుగునీరు సరఫరా అయిందన్నారు. నీటి ప్రవాహం తగ్గి ఇసుక తిన్నెలు బయటపడడంతో గత రెండు రోజులుగా ఫిల్టర్ పాయింట్ వేసే పనులు ప్రారంభించి ఆదివారం పూర్తి చేసినట్టు చెప్పారు. ఇకమీదట స్వచ్ఛమైన నీరు సరఫరా కానున్నట్టు చెప్పారు.

కాపు కల్యాణ మండప అభివృద్ధిపై చర్చ



అభివృద్ధి పనులపై ట్రస్టు సభ్యులతో చర్చిస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు

ద్వారకాతిరుమల: స్థానిక కాపు కల్యాణ మండపంలో ట్రస్టు చైర్మన్, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సభ్యులతో ఆయన చర్చించారు. కల్యాణ మండప సముదాయంలోని ఆంజనేయ కల్యాణ మండపాన్ని ఆధునీకరించాలని, అలాగే వెంకటేశ్వర కల్యాణ మండపంలో 3వ అంతస్తులో మరో నూతన కల్యాణ మండపాన్ని నిర్మించాలన్న దానిపై చర్చించారు. అలాగే కల్యాణ మండపంలో పనిచేసే సిబ్బందికి 45 రోజుల బోనస్‌లు ఇవ్వాలని నిర్ణయించారు. ఇలా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాపు కల్యాణ మండప ట్రెజరర్ మాకా శ్రీనివాసరావు, ట్రస్ట్ సభ్యులు పల్నాటి బుజ్జి, మధ్యాహ్నపు బలరాం, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, మైగాపు మోహన్, నంద్యాల కృష్ణమూర్తి తదితరులున్నారు.

కొండ గొర్రె మృతి

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన గో సంరక్షణశాలలో ఒక కొండ గొర్రె ఆదివారం ఉదయం మృతి చెందింది. గోశాలలో ఆవులు, ఏనుగు, కుందేళ్లు, కజానా బాతులతో పాటు, గత కొన్నాళ్లుగా ఈ కొండ గొర్రె క్షేత్రానికి వచ్చే భక్తులకు కనువిందు చేస్తోంది. అయితే కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈ గొర్రె ఉదయం గోశాల వద్ద మృతి చెందింది.